క్లుప్తంగా

అక్కడ దీపం వెలిగింది!



ధ్వజస్తంభంపై వెలుగుతున్న దీపం

కదిరి అర్బన్: పట్నం గ్రామంలో ఐదు దశాబ్దాల అనంతరం చెన్నకేశవస్వామి గుడిలో దీపం వెలిగింది. శనివారం రాత్రి ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపం వెలిగించారు. అతి పురాతన ఆలయాల్లో పట్నం చెన్నకేశవ స్వామి ఆలయం ఒకటి. దశాబ్దాల అనంతరం గుడి ధ్వజస్తంభంపై దీపం వెలగడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఓడీచెరువు: ఓడీసీ యువ సైన్యం, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మార్క్ హాస్పిటల్ అనంతపురం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరంలో 180 మందికి బీపీ, షుగర్, ఇసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యువ సైన్యం సభ్యులు లడ్డు బాబాజాన్, ఆరిఫ్, ఆసిఫ్, అర్షద్, గణేష్, వినోద్, అబు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి



మట్టి ఖర్చులకు సాయం అందిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి వీఆర్ఏ తుంగ పెద్దన్న (60) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన చాలా కాలంగా పుట్టపర్తిలో వీఆర్ఏగా పని చేస్తున్నారు. ఆయనకు ఐదుగురు కుమారులు ఉన్నారు. వీఆర్ఏ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు గంగాద్రి, ట్రెజరర్ నరసింహులు, సాయిరాం, కమిటీ మెంబర్లు... పెద్దన్న భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ తక్షణ సహాయం కింద మట్టి ఖర్చులకు రూ.10 వేలు వీఆర్ఏ కమిటీ నుంచి రూ.5 వేలు అందజేశారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ధర్మవరం రూరల్: చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్యాదిండి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో కొత్తచెరువు మండలం కొత్తదేవరపల్లికి చెందిన రామకృష్ణ, దినేష్ గాయపడ్డారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వీరిలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

క్రిస్మస్ వెలుగులు

ఓడీచెరువు: మండల కేంద్రంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చితో పాటు పలు చర్చిలు క్రిస్మస్ వేడుకకు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీలు, స్టార్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో నూతన శోభను సంతరించుకున్నాయి. సోమవారం క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సీ అండ్ఐజీ మిషన్ చర్చి పాస్టర్ డాక్టర్ జయానందం తెలిపారు.

ఘనంగా శ్రీవారి గరుడోత్సవం



గరుడ వాహనాన్ని లాగుతున్న దాతలు, భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ముక్కోటి ఏకాదశి పండుగ మరుసటిరోజు గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: మండల కేంద్రమైన బుక్కపట్నంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్ర బలిజ, కాపు జేఏసీ చైర్మన్ దాసరి రాము తదితరులతో కలిసి సినీ నటుడు పృథ్వీరాజ్.. కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి బలిజలు, కాపులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమానికి హాజరైన వారికి అన్నదానం చేశారు.

ప్రజలే మన 'బలగం'

- చేసిందే చెబుదాం..ధైర్యంగా ఓటు అడుగుదాం
- టీడీపీ, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడదాం
- సోషల్‌మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: కులాలు, మతాలు, పార్టీలు పక్కనబెట్టి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన జగనన్న ప్రభుత్వానికి ప్రజలే బలగం..అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ముఖ్యంగా జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై టీడీపీతో పాటు ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సోషల్‌మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ ప్రజలకు వాస్తవమేంటో తెలియజెప్పాలని సూచించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. ప్రముఖ జాతీయ ఛానల్ టైమ్స్‌నౌ ఇటీవల నిర్వహించిన సర్వేలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

పల్లె పల్లెకూ రోడ్లు వేశాం

కోవిడ్ కారణంగా రెండేళ్లు వృథాగా గడచి పోయినా..అనతి కాలంలోనే కదిరి నియోజకవర్గాన్ని మన పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని కదిరి ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నో మారుమూల గ్రామాలకు రోడ్లు వేశామని, ప్రతి చెరువునూ హంద్రీనీవా జలాలతో నింపామని వివరించారు. కదిరికి రూ.234 కోట్లతో బైపాస్‌రోడ్డు వేశామని, పట్టణంలో నలుదిక్కులా నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.18 కోట్లతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో పనులు జరుగుతున్నాయని, వేమారెడ్డి కూడలి నుంచి రాయలసీమ సర్కిల్ వరకూ రోడ్డును విస్తరించి ట్రాఫిక్ సమస్యను తీర్చామని తెలియజేశారు. హిందూపురం సర్కిల్ నుంచి కోనేరు వరకూ రోడ్డు విస్తరణకు అడ్డు తగిలిన పచ్చ పార్టీ నాయకులకు ప్రజలే ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఆయా సచివాలయాల్లోనే బోర్డులు పెట్టామని గుర్తు చేశారు. సోషల్‌మీడియా ప్రతినిధులు వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా మన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై మాత్రమే ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వారికి గుర్తింపు కార్డులు అందజేశారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

కదిరి: క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దైవ కుమారుడు జీసస్ మానవుడిగా జన్మించిన రోజును క్రిస్మస్‌గా జరుపుకుంటున్నామని, క్రిస్మస్ అనేది ఒక పండుగ మాత్రమే కాదు..అది మనిషిని నిరంతరం సన్మార్గంలో నడిపించే దైవికమైన ఒక భావన అని పేర్కొన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శత్రువుల పట్ల కూడా క్షమాగుణం ఇవన్నీ తన జీవితం ద్వారా క్రీస్తు మానవాళికిచ్చిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. ప్రజలందరికీ మంచి జరిగేలా ఎల్లప్పుడూ ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను సోమవారం సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

- ఎస్పీ మాధవరెడ్డి



పుట్టపర్తి టౌన్: లౌకిక భారత దేశంలో అన్ని కులాలు, మతాలు ఒక్కటేనని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. నేడు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, క్రైస్తవ సోదరులకు , పోలీస్ సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ మతం అయినా విశ్వశాంతినే కోరుకుంటుందన్నారు. శాంతియుత సహజీవనమే క్రిస్మస్ సందేశం కాగా సకల జనులూ సంయమనంతో కలసి మెలిసి ఉండాలన్న క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు.

శీతాకాలం...పశువులకు గడ్డుకాలం

- దోమ కాటుతో పాల దిగుబడిపై ప్రభావం
- పరిశుభ్రత, సౌకర్యాలు కల్పించాల్సిందే
- నాణ్యమైన పాల ఉత్పత్తికి జాగ్రత్తలు అవసరం
- పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి సూచనలు



పాడి పశువులు

బత్తలపల్లి: శీతాకాలం వచ్చేసింది. చలిగిలిగింతలు పెడుతోంది. చలి వల్ల వాతావరణంలో మార్పులతో రోగాలు వచ్చే అవకాశం ఉంది. శీతాకాలం పశువులకూ గడ్డుకాలమే అని చెప్పొచ్చు. ఈ సమయంలో పంట పొలాల కోతతో దోమలు పశువులపైకి విజృంభిస్తాయి.జిల్లాలో వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా పాడిపరిశ్రమపై జీవిస్తారు. ప్రస్తుతం పాలకు ఉన్న డిమాండ్‌తో నిరుద్యోగులు ఉపాధి మార్గంగా పాడి పశువుల పెంపకాన్ని ప్రారంభిస్తున్నారు. దీంతో పాల దిగుబడి తగ్గి తద్వారా రైతుకు ఆదాయం తగ్గుతుందని బత్తలపల్లి పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు. పశువుల శాలల్లో తగినన్ని సౌకర్యాలు కల్పించి, పరిశుభ్రంగా ఉంచితే మంచి దిగుబడి సాధించవచ్చని అంటున్నారు. శీతాకాలంలో పశువులు ఆరోగ్యంగా ఉండడానికి అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తిని సాధించొచ్చని చెప్తున్నారు. రైతులు పాడి పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. అంతే కాకుండా అధిక పాడిని ఉత్పత్తి చేయడమే కాకుండా ఆ పాలు పరిశుభ్రంగా, నాణ్యమైనవిగా ఉంచడానికి ప్రయత్నించాలని, రైతులు పాలు పితికే సమయంలోనూ, వాటిని కేంద్రాలకు తరలించే సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.

ఆయన మాటల్లోనే...



గుర్నాథరెడ్డి

- పశువులను కట్టేసే స్థలం పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- సాధ్యమైనంత వరకూ నేల గరుకు సిమెంట్‌తో చేసి చదునుగా ఉంచుకోవాలి.
- పశువుల నుంచి పాలను పితకడానికి ముందు నేలను ఊడ్చి నీటితో కడగాలి.
- పాలు పితికడానికి ముందు నేలను పాడి పశువును, పొదుగును గోరు వెచ్చని నీటితో శుభ్రంగా కడగాలి. అలా కుదరని పక్షంలో పొదుగును కడిగి పొడిగుడ్డతో శుభ్రంగా తుడవాలి.
- చుట్టు పక్కల బురద, మురుగు కాల్వలు, పేడ కుప్పలు ఉంకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- శీతాకాలంలో పశువులను దోమల నుంచి రక్షించేందుకు అవసరమైన దోమ తెరలను పశువుల శాల చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి.
- రాత్రి వేళల్లో పాడి పశువులను ఆరుబయట కట్టకుండా పాకల్లోనే కట్టుకోవాలి.
- స్టీలు, అల్యూమినియంతో తయారైన పాత్రలనే పాలు పిండుకోవడానికి వాడుకోవాలి.
- పాలు నిల్వ ఉంచే పాత్రలను సోడా పౌడర్ ఉపయోగించి వేడి నీటితో శుభ్రం చేయాలి.
- పాలు నిల్వ ఉంచిన పాత్రలను చల్లని ప్రదేశాల్లోనే ఉంచాలి.
- రాత్రి తీసిన పాలల్లో తాజా పాలను ఎట్టి పరిస్థితుల్లోను కలపకూడదు.
- ఈనిన 15 రోజుల వరకూ పాల కేంద్రాలకు పాలు పోయకూడదు. జున్ను పాలు కలిస్తే మంచి పాలు చెడిపోతాయి.
- పాడి పశువు నుంచి పూర్తిగా పాలను పితకకుండా మెల్లమెల్లగా పితికినా లేదా సగం పాలు మాత్రమే పతికినా ఆ పాలల్లో వెన్న శాతం తగ్గుతుంది.
- పాలల్లో ఎరుపు జీర, తొరకలు కనిపిస్తే పొదుగు వాపు లేదా గాయం అయి ఉండవచ్చు. తక్షణమే పశువైద్యుడిని సంప్రదించాలి.
- పశువులకు సాధారణంగా రోజుకు 50 నుంచి 60 లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. శీతాకాలంలో రోజుకు రెండు మూడు సార్లు నీటిని అందజేయాలి. తాగేందుకు నీరు పుష్కలంగా అందజేస్తే పాల దిగుబడి బాగుంటుంది.
- పాలు పితకడానికి రెండు గంటల ముందు, పితికిన గంట తర్వాత పశువులకు దాణా ఇవ్వాలి.
- పరిశుభ్రమైన వాతావరణంలో పశువులను కట్టివేస్తే అవి ఆరోగ్యంగా ఉండి మంచి పాడి ఉత్పత్తిని అందిస్తాయని, రైతులు గమనించాలని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాంతి హోమం



శాంతిహోమం చేస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం శాంతి హోమం, కలశ ఉద్వాసన, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గోవిందు

కనగానపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కనగానపల్లికి చెందిన వండ్ల గోవిందును ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రైతు సంఘం మహాసభలలో ఈ ఎంపిక జరిగినట్లు జిల్లా గౌరవాధ్యక్షులు మహదేవ ఓ ప్రకటనలో తెలిపారు. కనగానపల్లి మండల రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన గోవిందును జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఆయన తెలిపారు.

వకీలు పెదయ్య వర్ధంతి



వకీలు పెదయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, కుటుంబ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్ సమీపంలో మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తండ్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ మాలగుండ్ల వకీలు పెదయ్య వర్ధంతి నిర్వహించారు. వకీలు పెదయ్య 18వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ, సోదరులు మాలగుండ్ల రవీంద్ర, మాలగుండ్ల మల్లికార్జున, మాలగుండ్ల పృధ్వీ, కుటుంబ సభ్యులు పెదయ్య సమాధి వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గంధం వేడుకలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సజ్జద్‌బాబా

పెనుకొండ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బాబయ్య స్వామి గంధం వేడుకలను విజయవంతం చేయాలని బాబయ్య స్వామి మొదటి గంధం పీఠాధిపతి సజ్జద్‌బాబా విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటలకు మొదటి గంధం ప్రారంభమవుతుందన్నారు. పక్కీర్లు, మతపెద్దల ద్వారా గంధంను బాబయ్యస్వామికి సమర్పించడం జరుగుతుందన్నారు. భక్తులు గంధం వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

పురస్కారానికి ఎంపికైన గజల్ శ్రీనివాస్

పెనుకొండ: పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి అందించే జాతీయ సమైక్యతా జీవన సాఫల్య పురస్కారానికి డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేత

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం విద్యార్థిని షఫియాభానుకు జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి ఆదివారం ప్రశంసాపత్రం అందజేశారు. మానవతా విలువలతో కూడిన విద్యపై సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



పెద్దకోట్లలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న చౌడేశ్వరీదేవి

తాడిమర్రి: మండలంలో పెద్దకోట్లలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి ముందుగా అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు.

జేసీబీని ఢీ కొన్న బైక్

పెనుకొండ రూరల్: జేసీబీ వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన గోనిపేట బ్రిడ్జి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోనిపేటకు చెందిన భార్గవరెడ్డి, భరత్ ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో గోనిపేట బ్రిడ్జి సమీపంలోని మౌలాలి కళాశాల వద్దకు రాగానే రోడ్డును దాటుతున్న జేసీబీని ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.


గుండెపోటుతో కల్లుగీత కార్మికుడు మృతి



కోదండ రాముడు

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్లలో కల్లుగీత కార్మికుడు రాముడు (60) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన ఈడిగ కోదండ రాముడు కల్లుగీత (కల్లు అంగడి)తో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కోదండ రాముడు శనివారం కల్లుగీయ డానికి గ్రామం సమీపంలోని ఈదుల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉన్నంట్లుండి స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. దీంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కోదండ రాముడు భార్య లక్ష్మీదేవి ఆరేళ్ల క్రితం మృతి చెందింది. మృతుడికి కుమారుడు రామాంజనేయులు ఉన్నాడు.

రామగిరిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం



రామగిరిలో అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రామగిరి: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గ్రామస్తులు, అయ్యప్ప మాలధారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి ప్రత్యేక భజనలు, కీర్తనలు పాడుతుండగా మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టెలి కమ్యూనికేషన్ అడ్వైజర్‌గా డీఎల్ ఆంజనేయులు



డీఎల్‌ను సన్మానిస్తున్న నాయకులు

కదిరి టౌన్: భారత(బీఎస్ఎన్ఎల్) టెలి కమ్యూనికేషన్ అడ్వైజర్‌గా డీఎల్ అంజనేయులను నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం ఆయన్ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శేఖర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథికి ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన సీఎస్ కోటలోని క్యాథలిక్ చర్చి

కదిరి టౌన్: క్రిస్మస్ సందర్భంగా పట్టణంలో టవర్‌క్లాక్ వద్ద ఉన్న సీఅండ్ఐజీ మిషన్ చర్చి, ఇమ్మానియల్ చర్చి, పద్మస్ ప్రార్థన మందిరం, మగ్రిప్రేర్ చర్చిలు ముస్తాబయ్యాయి. సోమవారం ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

కనగానపల్లి: మండలంలోని చర్చిలు సోమవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు అందంగా ముస్తాబయ్యాయి. మండలంలోని సీఎస్ కోట, తగరకుంట, మామిళ్లపల్లి, కనగానపల్లి గ్రామాల్లో ఏటా క్రిస్మస్ వేడుకలను ప్రజలు నిర్వహిస్తారు. స్థానిక క్రైస్తవులు చర్చిలను అలంకరించారు. 90 శాతంపైగా క్రైస్తవులు ఉన్న చెన్నమనాయుని కోట (సీఎస్ కోట) లో ఏటా క్రిస్మస్ వేడుకలు జరుగుతాయి. తగరకుంటలోని యహోనా చర్చి, మామిళ్లపల్లిలోని బేతేలు బాపిస్టు చర్చిలను క్రిస్మస్ వేడుకలకు అలంకరించారు.



ముస్తాబైన సీఅండ్ఐజీ మిషన్ చర్చి



ముస్తాబైన ఇమ్మానియల్ చర్చి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోరంట్ల: స్థానిక బజాజ్ షోరూమ్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలసముద్రం గ్రామానికి చెందిన రహమాన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాలమేరకు... రహమాన్ గోరంట్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంలో పాలసముద్రం వెళ్తుండగా బజాజ్ షోరుమ్ సమీపంలో హిందూపురం- గోరంట్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొందన్నారు. రహమాన్ తీవ్రంగా గాయపడగా స్థానికులు గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు చెప్పారు.

బైక్ బోల్తా - యువకులకు గాయాలు

పెనుకొండ రూరల్: బైక్ బోల్తా పడటంతో యువకులు గాయపడిన సంఘటన పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. లేపాక్షికి చెందిన కిరణ్, నవీన్, వినయ్ ద్విచక్ర వాహనంలో పెనుకొండ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడ్డారన్నారు. గాయపడిన వారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.